క్లుప్తంగా

రేపు సరస్వతీ యాగం

తిరుపతి కల్చరల్: లోకకల్యాణంతోపాటు విద్యార్థుల భవిష్యత్తును కాంక్షిస్తూ ఆదివారం ఉదయం 8 గంటలకు ఇస్కాన్ మందిరం వద్ద నున్న కంచి మఠంలో సరస్వతీ యాగం నిర్వహించనున్నట్టు తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయకుమార్ తెలిపారు. ఇందులో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని అమ్మవారి కంకణాలు, ప్రసాదం స్వీకరించాలని కోరారు.

శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయండి

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు దళితవాడ శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి కోరారు. ఆయన శనివారం నెన్నూరు దళితవాడలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. శ్మశానాలకు రోడ్లు, నీటి సదుపాయం కల్పించాలన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని వాసవీకన్యకా పరమేశ్వరి, తిరుపతి గంగమ్మ, మాణి క్యాంబ దేవి, రంగన్నగారిగడ్డలోని కొల్లాపురమ్మ, భాకరాపేట ముత్యాలమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామచంద్రాపురం: ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ రఫీ తెలిపారు. అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందని, అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంత రావు, రఘునందన్ రావు, జబర్దస్త్ బృందం సభ్యులు ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కల్యాణ వెంకన్న సేవలో కమెడియన్ శీను



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామిని శుక్రవారం కమెడియన్ శీను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికలు

తిరుపతి కల్చరల్: ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షు డు పి.పరమశివన్, ప్రధాన కార్యదర్శి ఎం.త్యాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కొంతమంది స్వార్థపరులు సంఘంపై కోర్టులో కేసులు వేశారని తెలిపారు. తమకు అనుకూలంగా తీర్పు రావడంతో సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు వివరించారు. ఎన్నికల్లో పాల్గొనదలిచిన వారు అంబేడ్కర్ భవన్‌లోని సంఘం కార్యాలయంలో పేరు, డిపార్ట్‌మెంట్ చిరునామాతో సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

కూలిన వాటర్ ట్యాంక్ పైకప్పు



తిరుపతి మంగళం: శెట్టిపల్లిలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పైకప్పు శుక్రవారం కూలింది. శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను తొలగించి కొత్తది నిర్మించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. ట్యాంక్ పక్కనే పాఠశాల ఉందని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ట్యాంక్ తొలగించాలని కోరుతున్నారు.

పులకించిన తిరునగరి

ఆధ్యాత్మిక నగరం తిరుపతి పులకించింది. టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో శుక్రవారం తిరుపతి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భజన, కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శన నడుమ ఆధ్యాత్మిక శోభాయాత్రను అత్యంత వైభవంగా చేపట్టారు. అడుగడుగునా నగర వాసులు పుష్పాలు, పసుపునీళ్లు పోస్తూ, గుమ్మడికాయలతో దిష్టి తీస్తూ కర్పూర హారతులు పట్టారు.

–తిరుపతి కల్చరల్



జీయంగార్లకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న ఎమ్మెల్యే భూమన





శోభాయాత్రలో చెక్క భజనలు చేస్తున్న కళాకారులు, ఇస్కాన్ భక్తులు, డోలు వాయిద్య కళాకారులు..



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



దేవతా మూర్తుల వేషధారణలో కళాకారులు

భూమనను కలిసిన ఉదయగిరి రమేష్

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఉదయగిరి రమేష్ శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి ఇప్పించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమనను శాలువా కప్పి సన్మానించారు.



ఎమ్మెల్యే భూమనను సత్కరిస్తున్న ఉదయగిరి రమేష్

గంగమ్మ ఆలయ పనులపై చర్చ

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులపై ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం అధికారులతో చర్చించారు. ఆయన మేయర్ శిరీషతో కలిసి అమ్మవారి గర్భాలయ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులపై రాష్ట్ర హిందూ దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, దేవదాయశాఖ అధికారులతో చర్చించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

5వేల మంది విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



ప్యాడ్లు, నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తన కుమార్తె పుట్టిన రోజును పురస్కరించుకొని డాలర్ గ్రూప్ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి శుక్రవారం 5 వేల మంది విద్యార్థులకు ప్యాడ్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అన్నింటికీ ప్రధానం చదువేనని విద్యార్థులకు సూచించారు. డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ పేద విద్యార్థుల చేయూతనిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో చదివే 5 వేల మంది విద్యార్థులకు ప్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఆయన కుమార్తె గెహినీరెడ్డి, డాలర్స్ గ్రూప్, డాలర్స్ డివైన్ క్లబ్, గేహిని డెవలపర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వందశాతం రుణాలు ఇవ్వండి

తిరుపతి అర్బన్: అన్ని విభాగాలకు బ్యాంకర్లు వంద శాతం రుణాలు ఇవ్వాలని జేసీ డీకే బాలాజీ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీని లీడ్ బ్యాంక్ సహకారంతో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ మార్చి చివరికల్లా వ్యవసాయ, అనుబంధ రంగాలకు వంద శాతం రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యకు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు 57 శాతం మాత్రమే రుణాలు ఇచ్చాయన్నారు. సైబర్ క్రైం బ్రాంచ్ అధికారుల సూచనల మేరకు 628 కేసులు నమోదయ్యాయని, రూ.29 కోట్లు బ్యాంకుల వద్ద ఫ్రీజింగ్ చేశారని తెలిపారు. వాటికి రీయింబర్స్‌మెంట్ జరిగేలా పోలీస్ అధికారులకు సహకారం అందించాలన్నారు. సమీక్షలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్.సుభాష్, ఆర్‌బీఐ ప్రతినిధి పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎం జీ.రాంప్రసాద్, ఇండియన్ బ్యాంక్ డీజీఎం అరుణ, నాబార్డ్ డీడీఎం సునీల్, ఎస్‌బీఐ ఆర్‌ఎం జయకుమార్, శైలేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఏపీ ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యదర్శి ముప్పల నరసింహులు సభ్యులతో ప్రమాణం చేయించారు. అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కన్యకాపరమేశ్వరి ఆలయ పాలక మండలి వర్కింగ్ ప్రెసిడెంట్ పామిడి సత్యనారాయణ, కొండూరి మహేష్, కామిశెట్టి శ్రీధర హేమచంద్రకుమార్, శిరీష, మంజునాథ్ పాల్గొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

తిరుచానూరు(చంద్రగిరి): ఓటేరు షికారీ కాలనీలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. షికారీ కాలనీకి చెందిన సోనియా తిరుమలలో పూసల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వారంతా బయటకు పరుగులు తీశారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. అప్పటికే టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ తదితరాలు కాలిపోయాయి. అలాగే ఇంట్లో ఉంచిన రూ.1.70 లక్షల నగదు, 12 గ్రాముల బంగారం కాలిబూడిదైనట్లు బాధితురాలు వాపోయింది.



కాలిపోతున్న గుడిసె

అన్ని వర్గాలకు సముచిత స్థానం జగనన్నకే సాధ్యం



భాకరాపేట: అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడం జగనన్నకే సాధ్యమని చిత్తూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సామకోటి నాగలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్సీల ఎంపికలో వంద శాతం సామాజిక న్యాయం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తోందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

డ్రగ్స్ నియంత్రణకు కృషి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ లీలారాణి

పాకాల: డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా పిలుపునిచ్చారు. కళాశాలలోని ఇన్‌క్లూసివ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.లీలారాణి మట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో అనేక దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు బానిసలు ఉంటే వారి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలియజేయాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, ఇన్‌క్లూసివ్ సెంటర్ కో–ఆర్డినేటర్ చిట్టి కళావతి పాల్గొన్నారు.

చేపల వేలంలో పంచాయతీలకు ఆదాయం

ఎర్రావారిపాళెం: మండలంలోని నాలుగు పంచాయతీల్లో చేపల చెరువుల వేలం నిర్వహించగా భారీగా ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి మజహర్ బాషా తెలిపారు. కూరపర్తివారిపల్లి చెరువు నుంచి రూ.67,400, కోటకాడపల్లి చెరువు నుంచి రూ.1,28,500, వీఆర్ అగ్రహారం చెరువు నుంచి రూ.59,400, బోడేవాండ్లపల్లి చెరువు నుంచి రూ.1,39,700 ఆదాయం వచ్చిందని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పాకాల: దామలచెరువు సమీపంలోని అక్కంచెరువుకు వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం చేశారు. గుడివాడకు చెందిన కొణదల చక్రధర్ సంవత్సరీకం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ పాకాల ప్లాటినం అధ్యక్షుడు రఘునాథనాయుడు, కార్యదర్శి విజయ్‌బాబు, సభ్యులు అబ్దుల్‌ఘని, నెల్లూరు ధనంజయ, చెఫ్ మహేష్‌బాబు పాల్గొన్నారు.

మార్చి 3, 4 తేదీల్లో చిరు వ్యాపారుల మహాసభలు

తిరుపతి కల్చరల్: ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరులో మార్చి 3, 4 తేదీల్లో తిరుపతి జిల్లా చిరు వ్యాపారుల ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వీధి వ్యాపారుల తిరుపతి నగర సమితి సమావేశం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో వైద్య విద్యార్థిని మృతిచెందగా, మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన యామిని (29), కృష్ణా జిల్లాకు చెందిన శ్రావణి నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో పీజీ (గైనకాలజీ) సెకండియర్ చదువుతూ కళాశాల హాస్టల్లో ఉంటున్నారు. తమ సహచర విద్యార్థినులు హస్నీనబీ, వినీలాతో కలిసి యామిని, శ్రావణి రెండు వాహనాల్లో జాతీయ రహదారిపై గల ప్రెస్టో హోటల్‌కు బయల్దేరారు. యామిని, శ్రావణి రోడ్డు దాటే క్రమంలో చెన్నై వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. యామిని అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. శ్రావణి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. హాస్పిటల్‌కు చేరుకొని సహచర విద్యార్థినులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

ఘనంగా గంధోత్సవం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ముస్లిం మత పెద్దలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్దనున్న ఖాదరీ పీఠంలోని దర్గాలో శుక్రవారం సాయంత్రం 77వ గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖాదరీ పీఠాధిపతి, ప్రభుత్వ కాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ మాట్లాడుతూ మతంకన్నా మానవత్వం గొప్పదన్నారు. తల్లి, తండ్రి, గురువు అడుగుజాడల్లో నడిచి ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఉర్దునాతిహముషాయిర్ ఉర్దు కవి సమ్మేళనం నిర్వహించారు. ఫకీర్ల జరబులు విన్యాసాల మధ్య సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ తకి ఖాదరీ, షేక్ మిర్జా సాహెబ్, సయ్యద్ ఆరీవుల్లా, సయ్యద్ ఉస్మాన్ ఖాదరీ, బుబేర్ ఖాదరి, వైఎస్సార్ సీపీ నేతలు ఎంపీఎస్.మణి, ఆదికేశవులురెడ్డి, కార్పొరేటర్లు ఆర్.వెంకటేశ్వర్లు, హనుమంత్ నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పళ్లెం కానుక

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి పెద్దాపురానికి చెందిన జగన్నాథరావు దంపతులు శుక్రవారం వెండి పళ్లెంను కానుకగా అందించారు. వెండి పళ్లెం విలువ సుమారు రూ.37 వేలు వుంటుందని ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి తెలిపారు. దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ జయకుమార్ ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.



వెండి పళ్లెం అందజేస్తున్న దాతలు

ఇంటర్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ఎర్రావారిపాళెం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో జరిగిన వీడ్కోలు సమావేశానికి ఎంఈవో బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు పాఠశాలలో సరస్వతి పూజ, గురువులకు వందనం కార్యక్రమాలు చేశారు. ఆటపాటలు, సాంస్కృతి కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బీటీ శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వీడ్కోలు దినోత్సవంలో విద్యార్థులు, టీచర్లు

ఘనంగా రేవంత్ న్యూరో కేర్ వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: రెడ్డిరెడ్డి కాలనీలోని రేవంత్ న్యూరో కేర్ 5వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రేవంత్ న్యూరో కేర్ అధినేత డాక్టర్ ఎం.రేవంత్‌రెడ్డికి పలువురు వైద్యులు, శ్రేయోభిలాషులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ రేవంత్ న్యూరో కేర్ సెంటర్‌లో పక్షవాతం, మూర్ఛవ్యాధి, తలనొప్పి, మెడ, నడుము నొప్పి, నరాలు, కండరాల బలహీనత, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, మంటలు, కళ్లు తిరగడం, చేతులు కాళ్లు వణకడం, మతి మరుపు, నిద్ర సమస్యలు తదితరాలకు ఆధునిక వైద్య చికిత్సలు అందజేస్తామన్నారు.



డాక్టర్ రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యులు, శ్రేయోభిలాషులు

ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీలో రెండు రోజులుగా భారతదేశంలో పరువు హత్యలు–సామాజిక మానసిక కారకాలు అన్న అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. మహిళా అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ ఉమెన్ సేఫ్టీ సంయుక్తంగా సదస్సును నిర్వహించారు. ముగింపు సమావేశంలో న్యూఢిల్లీకి చెందిన లోకనాయక్ జయప్రకాష్ నారాయణ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ క్రిమినాలజీ చైర్ ప్రొఫెసర్ బ్యులాశేఖర్ పాల్గొని మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో లింగ వివక్షత, హానర్ కిల్లింగ్ వంటి అనాగరిక దురాచారాలు అడ్డంకులుగా నిలిచాయని తెలిపారు. పితృస్వామ్య భావజాల మూలాలను సమగ్రమైన కార్యాచరణతో నిర్మూలించవచ్చన్నారు. మహిళా అధ్యయన కేంద్ర విభాగం ఇన్‌చార్జ్ హెడ్ నీరజ మాట్లాడుతూ పరువు హత్య మానవ హక్కుల ఉల్లంఘనేనన్నారు. అనంతరం ఈ సదస్సులో 6 సెషన్స్ ద్వారా వంద మందికి పైగా పత్ర సమర్పణలు చేశారు. ఈ సదస్సులో ప్రొఫెసర్లు శారద, మాధురి పరదశి, అముదవల్లి, సాయిసుజాత, నిర్మల, స్టూడెంట్ అఫైర్స్ డీన్ శారద పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

పాకాల: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తిరుపతి జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఆయనను శుక్రవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమపంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నాయకులు నంగా నరేష్‌రెడ్డి, నంగా బాబురెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, లింగయ్యనాయుడు, రఘుపతి, రహీం, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చెన్నకేశవరెడ్డి, నాయకులు